క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: నల్లగొండలోని పలు కాలనీల్లో రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నల్లగొండ విద్యుత్ ఏడీఈ శంకరయ్య శుక్రవారం తెలిపారు. నల్లగొండ బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, అన్సారీ కాలనీ, గొల్లగూడ, అవుట్ డోర్ స్టేడియం, పెద్దబండ, ఆర్టీసీ కాలనీ, పద్మావతి కాలనీ, క్రాంతినగర్ ఏరియాల్లో శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. సంబంధిత కాలనీ ప్రజలు సహకరించాలని కోరారు.

మహిళా సాధికారతపై అవగాహన

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, ప్రధానోపాధ్యాయురాలు అరుణశ్రీ, ఝాన్సీరాణి, సునీత, శ్రీదేవి, జానమ్మ, పర్వీన్, రజిత పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిరంతర పోరాటాలు

చిట్యాల: ప్రజల పక్షాన సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. చిట్యాల మండలం ఎలికట్టె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలన్నారు. ఆ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి సాగర్ల సత్తయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి అక్బర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జహంగీర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షరీఫ్, బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు రావుల చిన వెంకన్న, కొండపల్లి కృష్ణ, ఉయ్యాల మల్లేష్, మర్రి రమేష్ పాల్గొన్నారు.

బాలలను పనికి పంపిస్తే చర్యలు



కమిటీ సమావేశంలో పాల్గొన్న శివేషా

చండూరు: పిల్లలను ఇతర ప్రాంతాలకు పనులకు పంపిస్తే బాలల అక్రమ రవాణా కిందకు వస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శివేషా అన్నారు. శుక్రవారం చండూరు మండలంలోని కొండాపురం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్రమ రవాణా నిషేధ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. బాల్య వివాహాలు చేయొద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదమ్మ, హెచ్‌ఎం భద్రయ్య, ఏఎన్ఎం ప్రకాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కనగల్: మండల కేంద్రంలోని శ్రీ అక్కెనపల్లి వెంకటేశ్వర మెమోరియల్ మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ మమత శుక్రవారం తెలిపారు. వీరు ఈ నెల 24నుంచి 27వరకు మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూర్ జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. బేస్‌బాల్ పోటీలకు బి సౌమ్య, వర్ష, సుష్మిత, మానస, బాలుర విభాగంలో ప్రవీణ్, శివాజీ, సందీప్, మణికంఠ, ఖోఖో విభాగంలో పావని, శివ, చెస్ విభాగంలో అనురాధ, సుశీలత ఉమ్మడి నల్లగొండ జిల్లా తరుపున రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని అభినందించారు.

నీటిని విడుదల చేయాలి

కనగల్: సాగు, తాగునీటి కోసం ఏఎంఆర్‌పీ ద్వారా కనగల్ మైల సముద్రం చెరువుకు నీటిని విడుదల చేయాలని జి చెన్నారం సర్పంచ్ ఉప్పునూతల వెంకన్న కోరారు. శుక్రవారం కనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండ్లపల్లి వద్ద ఉన్న డీ- 37 కాల్వ ద్వారా చెరువుకు నీటిని విడుదల చేస్తే అనంతారం, జి చెన్నారం, దర్వేశిపురం గ్రామాల్లో కాలువ వెంట ఉన్న బోరు, బావుల్లోకి నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి నీరు విడుదల చేసేలా చూడాలని కోరారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

శాలిగౌరారం: కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన శాలిగౌరారంలో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

రోడ్డు వేశారు.. మట్టి మరిచారు

- ఎదురుగా భారీ వాహనాలు వస్తే రోడ్డు దిగే సమయంలో ఇబ్బందులు
- పెండింగ్‌లోనే కల్వర్టులు, సీసీ నిర్మాణ పనులు



రోడ్డు వెంట మట్టి పోయకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న రహదారి

మునుగోడు: కొంపల్లి నుంచి చండూరు మండలం కొండాపురం వరకు వేసిన బీటీ రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఏదైన భారీ వాహనం ఎదురుగా వస్తే రోడ్డు కిందకు దిగే సమయంలో అదుపుతప్పి కిందపడిపోతున్నారు. అదే విధంగా ఈ రోడ్డులో నాలుగు కల్వర్టుల నిర్మాణాలు, 200 మీటర్ల మేర సీసీ రోడ్డు పనులు పెండింగ్‌లోనే ఉంచారు.

రూ.కోటి 68 లక్షలు మంజూరు..

కొంపల్లి గ్రామం నుంచి కల్వకుంట్ల గ్రామం మీదుగా కొండాపురం వరకు 5 కిలోమీటర్లు ఉన్న రోడ్డు నిర్మాణానికి సెప్టెంబర్‌లో ఎంఆర్ఆర్(మెయింటన్స్ ఆఫ్ రూరల్) నిధుల నుంచి రూ. కోటి 68 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్డు వేయడంతోపాటు, అక్కడక్కడా నాలుగు కల్వర్టులు, 200 మీటర్ల మేర సీసీ రోడ్డు, రోడ్డుకు ఇరువైపులా 5 మీటర్ల వెడల్పులో మట్టిని పోయించాలి. కానీ ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కేవలం బీటీ రోడ్డు మరమ్మతులు చేసి వదిలేశాడు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పెండింగ్ పనులు పూర్తి చేయించడంతో పాటు ప్రధానంగా రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

అసంపూర్తిగా వదిలేశారు



రోడ్డు మరమ్మతులు చేసి ఇరువైపులా మట్టి పోయక పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాంట్రాక్టర్ సీసీరోడ్డు పనులు, కల్వర్టుల నిర్మాణాలు కూడా పూర్తి చేయలేదు.

– పగిళ్ల భిక్షం, కల్వకుంట్ల సర్పంచ్

త్వరలో పనులు పూర్తి చేయిస్తాం

త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తాం. కల్వర్టులు, 200 మీటర్ల సీసీ, రోడ్డుకు ఇరువైపులా 5 పీట్ల వెడల్పుతో మట్టిని పోయించేందుకు ఎంఆర్ఆర్ నిధుల నుంచి రూ. కోటి 68 లక్షలు మంజూరయ్యాయి. రెండు నెలల క్రితం బీటీ రోడ్డు పనులు పూర్తి చేశాడు. మిగిలిన పనులు చేయాల్సి ఉంది.

– రామకృష్ణ, పంచాయతీ రాజ్ ఏఈ, మునుగోడు

బెల్టు దుకాణాల రద్దుపై హర్షం



ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

మునుగోడు: గ్రామాల్లో బెల్టు దుకాణాలను రద్దు చేయించడాన్ని హర్షిస్తూ మునుగోడు మండలంలోని చీకటిమామిడి గ్రామంలో పలువురు మహిళలు శుక్రవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాటికొండ సంతోష ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తమ గ్రామంలో బెల్టు దుకాణాలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఏకగ్రీవ తీర్మానం చేశామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలకూరి యాదయ్య గౌడ్, నాయకులు పగిళ్ల నగేష్, అనంత శ్రీను, జీడిమడ్ల ధర్మయ్య, ఏరుకొండ శ్రీరాములు, వెంకన్న, యాదగిరి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

నకిరేకల్: మండలంలోని చందుపట్లకు చెందిన దుస్స భారతమ్మ కుటుంబ దీనస్థితిపై సాక్షి దినపత్రికలో ఈనెల11న పేద కుటుంబాన్ని ఆదుకోరూ.. శీర్షికన కథనం ప్రచురితమైంది. చందుపట్ల ఎంప్లాయిస్ గ్రూప్ సభ్యుల్లోని పలువురు ఉద్యోగస్తులు స్పందించి గ్రూప్ ద్వారా సేకరించిన రూ.10 వేల నగదును భారతమ్మకు శుక్రవారం అందజేశారు. వారిలో పూస నర్సింహ, భాస్కర్ ఉన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



కేతేపల్లిలో ఎమ్మెల్యే వీరేశంను గజమాలతో సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కేతేపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కేతేపల్లి నుంచి మూసీ ప్రాజెక్టు వరకు, కొర్లపహాడ్ నుంచి మోడల్ స్కూల్ మీదుగా గుడివాడ వరకు డబుల్ రోడ్డు, అదేవిధంగా నూతన ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. మండలంలో శాఖల వారీగా ఉన్న ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు రూపొందించి పంపించాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ఎమ్మెల్యేను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, వైస్ ఎంపీపీ పీబీ మాధవి, ఎంపీడీఓ హరికృష్ణ, తహసీల్దారు ఎస్.మధుసూధన్‌రెడ్డి, ఎంఈఓ నాగయ్య, ఏఓ బి.పురుషోత్తం, మండల వైద్యాధికారి అర్చన, ఏఈలు గ్రాబ్రియేల్, మౌనిక, అంగన్‌వాడీ మండల సూపర్‌వైజర్ కళావతి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

నకిరేకల్: ప్రతి క్రీడాకారుడు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం నకిరేకల్‌లోని మినీస్టేడియంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ రాజీవ్ ట్రోఫీ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగధర్‌రావు, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, మినీ స్టేడియం చైర్మన్ రాచకొండ శ్రీధర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు నివాళి



నల్లగొండ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన గణిత విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థులు



గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో..

నల్లగొండ: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు క్విజ్, మ్యాథ్స్, రంగోలి, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. అంతకుముందు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మీరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో శుక్రవారం నేషనల్ మ్యాథ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ మునీర్, అధ్యాపకులు నక్క నర్సింహ, యాదగిరిరెడ్డి, దీపిక, జోత్స్న, దుర్గాప్రసాద్, మధుకర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

చండూరు: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని చండూరులోని గాంధీజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్స్ చెరుపల్లి రామయ్య, సత్యనారాయణ మూర్తి, వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం నాయక్, వడ్లగాని సాయిరాం, రాణి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్‌లోని ఎస్‌పీఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విజనరీ శ్రీపతి రెడ్డి, కరస్పాండెంట్ కన్నయ్య గౌడ్, అకడమిక్ డైరెక్టర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: గణిత దినోత్సవం సందర్భంగా చిట్యాల పట్టణంలోని కేటీఎస్ స్కూల్‌లో రామానుజన్ చిత్రపటానికి ఎంజీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గుజ్జుల ఉపేందర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల గణిత విజ్ఞాన ప్రదర్శనలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బొడ్డు యాదగిరిగౌడ్, స్కూల్ డైరెక్టర్ శ్రీధర్, గణిత ఉపాధ్యాయులు వరదరాజు, ఉపాధ్యాయులు రజిత, శివాణి పాల్గొన్నారు.

నేరడలో..

చిట్యాల మండలంలోని నేరడ గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు గణిత రంగోలి, గణిత మేళా నిర్వహించారు. విజ్ఞాన ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారిని హెచ్‌ఎం జి.రాంమోహన్, గణిత ఉపాధ్యాయుడు దాసరి శ్రీరాములు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ సీనయ్య, మల్లిఖార్జున్, రవినా, అప్రోచ్, ధర్మేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



నకిరేకల్: ఎస్‌పీఆర్ స్కూల్‌లో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



చిట్యాల: నేరడ జెడ్పీహెచ్ఎస్‌లో..



చండూరు: గాంధీజీ పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసులు

పార్లమెంట్ సభ్యుల సస్పెన్షన్ దారుణం




చిట్యాలలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 146 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఇందూరు సాగర్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో స్మోక్ అటాక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర పార్టీల సభ్యులు ప్రశ్నించినందుకు వారిని సస్పెండ్ చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎండీ సలీమ్, లోడంగి శ్రవణ్ కుమార్, నర్సిరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, విశ్వనాదుల లెనిన్, శంకర్, నల్పరాజు సైదులు, కొండ ఎంకన్న, బొల్లు రవీంద్ర కుమార్, కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నరసింహ, మధుసూదన్ రెడ్డి, చంద్రం పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

చిట్యాల: పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యాన్ని ప్రశ్నిస్తున్న సభ్యులను సస్పెండ్ చేసి కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య ఆరోపించారు. పార్లమెంట్‌లో 150 మంది సభ్యుల సస్పెన్షన్‌కు నిరసనగా శుక్రవారం చిట్యాలలో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, పార్టీ మండల రూరల్ కార్యదర్శి అరూరీ శ్రీను, నాయకులు బొబ్బలి సుధాకర్‌రెడ్డి, గుడిసే లక్ష్మీనారాయణ, కల్లూరి కుమారస్వామి, మేడి సుగుణమ్మ, ఐతరాజు యాదయ్య, లోడే విష్ణుమూర్తి, జిట్ట స్వామి, దుర్గేష్, బాలనర్సమ్మ, ఇందిరా, నాగయ్య పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రావు

కట్టంగూర్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ భువనగిరి జిల్లా అధ్యక్షుడు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. శుక్రవారం కట్టంగూర్ మండలంలోని పామనగుండ్ల గ్రామంలో నిర్వహించిన నకిరేకల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ మాధురి ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి మల్లేశం, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నకిరేకంటి మొగులయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు ఐతగోని అనిత, జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, దళితమోర్చ అధ్యక్షుడు గోలి ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సైదులు, శంకర్, రమేష్, నవీన్, వినోద్, మల్లిఖార్జున్, నవీన్ పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ

చండూరు (గట్టుప్పల్): క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రభుత్వం అందించిన క్రిస్మస్ కానుకలను శుక్రవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, స్థానిక సర్పంచ్ ఇడెం రోజా, తహసీల్దార్ లావణ్య పంపిణీ చేశారు. అనంతరం విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నామని జగన్నాథం, తేరట్‌పల్లి ఎంపీటీసీ గొరిగే సత్తయ్య, పాస్టర్లు నర్సింహ, శివ, లక్ష్మయ్య, వాసు, మార్క్ నాయక్, స్వామి ఉన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డికి భువనగిరి ఎంపీ టికెట్ ఇవ్వాలి

కేతేపల్లి: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ నియోజకవర్గ టికెట్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆలుగుబెల్లి మహేందర్‌రెడ్డి పార్టీ అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం ఆయన కేతేపల్లిలో మాట్లాడారు. కిరణ్‌కుమార్‌రెడ్డి 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు.

● సముద్రాల భారతికి నివాళి



నల్లగొండలోని వీటీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన సముద్రాల భారతి వర్ధంతి కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, సీనియర్ న్యాయవాది అమరేందర్‌రెడ్డి, ఏచూరి భాస్కర్‌రావు తదితరులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం హరితహారం, డయాబెటీస్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వంటిపాక సుశీల, లయన్స్ క్లబ్ డైరెక్టర్ గట్టుపల్లి రవీందర్‌రెడ్డి, రీజనల్ చైర్ పర్సన్ గట్టుపల్లి అశోక్‌రెడ్డి, జెల్లా దశరథ, యర్రమాద శ్రీనివాస్, ఎల్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న అన్నారు. శుక్రవారం శాలిగౌరారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాలనపై గాదరి కిశోర్ ప్రశ్నిస్తే ఆయనను దూషిస్తున్నారన్నారు. సమావేశంలో ఎంపీపీ గంట లక్ష్మమ్మ, నాయకులు చాడ సతీష్‌రెడ్డి, గుండా శ్రీనివాసులు, గుజిలాల్ శేఖర్‌బాబు, మామిడి సర్వయ్య, గంట శంకర్, గోదల సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసిన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో కొన్ని రోజులుగా కృష్ణా జలాల పైపులైన్ లీకేజీ అయి నీరు వృథాగా పోతోంది. దీంతో 'వృథాగా కృష్ణా జలాలు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రిక ఆదివారం కథనం ప్రచురించింది. స్పందించిన సంబంధిత అధికారులు శుక్రవారం మరమ్మతులు చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శాలిగౌరారం: మండలంలోని అంబారిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు తోట నర్సయ్య ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. అదేవిధంగా ఎన్‌జీ కొత్తపల్లిలో ఇటీవల మృతిచెందిన కల్లుగీత కార్మికుడు బొల్లేపల్లి శంకర్ కుటుంబాన్ని పరామర్శించారు.

బాప్టిస్ట్ కన్వెన్షన్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్



నల్లగొండలో కేక్ కట్ చేస్తున్న సూదిని మనోహర్‌రెడ్డి, భద్రాద్రి, పాస్టర్లు



నకిరేకల్‌లోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని కోటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం తెలుగు బాప్టిస్ట్ కన్వెన్షన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి పదవి పొందిన సందర్భంగా కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి మామ సూదిని మనోహర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పాస్టర్ డాక్టర్ గొల్లపల్లి మోజెస్, తెలుగు బాప్టిస్ట్ కన్వెన్షన్ అధ్యక్షుడు తాళ్లూరి శ్యామ్, డాక్టర్ జోసఫ్ ప్రభాకర్, రిటైర్డ్ టౌన్ ప్లానింగ్ అధికారి తంగిరాల ఇమ్మానుయేల్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేఖల భద్రాద్రి, జెకార్య, బి.ప్రకాష్, ఆర్.సుధాకర్,, రూథ మోజెస్, డాక్టర్ సత్యపాల్ పాల్గొన్నారు.

పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

నకిరేకల్: నకిరేకల్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో శుక్రవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. వివిధ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు అండెం వెంకటేశ్వర్లు, వరకాంతం నారాయణరెడ్డి, రాంమోహన్ రావు, బొల్లం కృష్ణమూర్తి, దేశగాని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేషం, నేతి విద్యాసాగర్

నకిరేకల్: నకిరేకల్ మండలం పన్నాలగూడెంలోని తన నివాసంలో ఎమ్మెల్యే వేముల వీరేషం శుక్రవారం అయ్యప్ప స్వామి ద్వితీయ మహా పడిపూజ నిర్వహించారు. గురుస్వామి చంద్రమౌళి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపించారు. పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారులు పెద్దఎత్తున హాజరయ్యారు. వేడుకల్లో శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, టీపీసీసీ నేత దైద రవీందర్, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప మహా పడిపూజ

మర్రిగూడ: మండల కేంద్రంలోని జీపీఆర్ గార్డెన్‌లో శనివారం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించనున్నట్లు చెరుకు శ్రీరాంగౌడ్ గురుస్వామి శుక్రవారం తెలిపారు. అయ్యప్ప స్వాములతోపాటు భక్తులు పడిపూజకు హాజరుకావాలని కోరారు.

హార్మోన్ల సమతుల్యతపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న రుమానా కౌసర్

నల్లగొండ రూరల్: హార్మోన్ల సమతుల్యతపై విద్యార్థినులకు అవగాహన ఉండాలని డైటీషియన్ రుమానా కౌసర్ అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్‌లో ఉన్న మైనార్టీ ఇంటర్ గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థినులకు హార్మోన్ల సమతుల్యతపై అవగాహన కల్పించారు. నిత్య వ్యాయామం చేయాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.